క్లుప్తంగా

ఘనంగా కాశీంస్వామి ఉరుసు


పెండేకల్లులో కాశీంస్వామి షంషేర్ ఊరేగింపు

తుగ్గలి: మండల పరిధిలోని పెండేకల్లులో కాశీంస్వామి ఉరుసు ఉత్సవాలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున పూలతో అలంకరించిన స్వామి షంషేర్‌ను గుర్రంపై ఉంచి మేళతాళాలతో గ్రామంలో ఊరేగింపు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ పెద్దలు, దర్గా నిర్వాహకులు పాల్గొన్నారు.

నేడు స్పందన కార్యక్రమం

కృష్ణగిరి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రాజేశ్వరి ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ తప్పక హాజరుకావాలన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ఇస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

పకడ్బందీగా కులగణన


బంటణహాలులో వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

చిప్పగిరి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన కార్యక్రమం మండలంలో పకడ్బందీగా కొనసాగుతోంది. మండలంలోని 16 గ్రామాలలో అధికారుల బృందం ఇంటింటికీ వెళ్లి ప్రజల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. కులగణన సర్వేను ఎంపీడీఓ సీపీ కొండయ్య, ఈఓపీఆర్డీ బాలన్న పర్యవేక్షిస్తున్నారు. మండలంలో ఇప్పటివరకు 85 శాతం సర్వే పూర్తయినట్లు వారు తెలిపారు.

హొళగుంద ఎస్‌ఐగా పెద్దయ్యనాయుడు

హొళగుంద: మండల ఎస్‌ఐగా ఆదోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న పెద్దయ్యనాయుడును నియమిస్తూ జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేస్తున్న వల్లెపు శ్రీనివాసులును పోస్టింగ్ కోసం వీఆర్‌కు పంపించగా హొళగుందకు పెద్దయ్యనాయుడును నియమించారు. కొత్త ఎస్‌ఐ త్వరలో బాధ్యతలు చేపట్టనున్నట్లు వారు తెలిపారు.

నేటి నుంచి సుంకులమ్మ దేవర


సుంకులమ్మ మూలవిరాట్

మద్దికెర: స్థానిక సాయినగర్‌లో కొలువైన నలివేలి సుంకులా పరమేశ్వరి దేవి దేవర రెండు రోజుల పాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు కాలనీవాసులు ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం అమ్మవారికి ఆకుపూజ తదితర కార్యక్రమాలు ఉంటాయని రాత్రి మద్దమాంబ కళా సమితి వారిచే నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. 30వ తేదీ బోనాల ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించి పూజలు చేయడం జరుగుతుందన్నారు.

పాలిటెక్నిక్ సిలబస్ కమిటీలో చోటు


మల్యాల శ్రీకాంత్

హాలహర్వి: రాష్ట్ర పాలిటెక్నిక్ అకాడమిక్ సిలబస్ కమిటీలో చింతకుంటకు చెందిన మల్యాల శ్రీకాంత్‌కు చోటు లభించింది. ఈయన 1వ తరగతి నుంచి 7వ తరగతి చింతకుంటలోని పాఠశాల, 8 నుంచి 10వ తరగతి వరకు హాలహర్విలోని జెడ్పీ హైస్కూల్‌లో విద్యనభ్యసించారు. రాష్ట్ర పాలిటెక్నిక్ అకాడమిక్ సిలబస్ కమిటీ మెంబర్‌గా ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు.

అ'పూర్వ' కలయిక


ఎమ్మిగనూరు వీవర్స్ కాలనీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని వీవర్స్ కాలనీ హైస్కూల్‌లో 2003–2004 విద్యా సంవత్సరంలో చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం సాయంత్రం జరిగింది. పూర్వ విద్యార్థులందరూ ఒక్కచోట కలుసుకుని నాటి మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకుంటూ సంతోషంగా గడిపారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు రామ్మోహన్‌రావు, విజయ్‌కుమార్, హెచ్‌ఎం నాగభూషణ్‌రెడ్డి, పూర్వపు ఉపాధ్యాయులు అన్నపూర్ణ, ప్రమీళ, జయలక్ష్మి తదితరులు ఉపాధ్యాయులను సత్కరించారు.



ఎమ్మిగనూరు జాతరలో రూ.2.50 లక్షలకు విక్రయానికి ఉంచిన వృషభాలు


కొడవళ్లు, గొడ్డళ్లు, వ్యవసాయ పనిముట్లు విక్రయిస్తున్న వ్యాపారులు

జాతర సందడి


విక్రయానికి ఉంచిన కాడిమాన్లు

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరు పట్టణంలో అత్యంత వైభవంగా ప్రారంభమైన నీలకంఠేశ్వర స్వామి జాతరలో భాగంగా రైతన్నలకు వ్యవసాయానికి అవసరమైన సామగ్రిని విక్రయించేందుకు వ్యాపారులు పెద్దఎత్తున తీసుకొచ్చారు. మంత్రాలయం రహదారి సమీపంలో ఎడ్లను భారీ సంఖ్యలో విక్రయానికి ఉంచారు. జత ఎడ్లు రూ.లక్ష నుంచి రూ.2.50 లక్షల వరకు ఉండగా వాటిని పరిశీలించి కొనుగోలు చేసేందుకు పలు ప్రాంతాల నుంచి రైతులు, పశుపోషకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అదేవిధంగా ఎద్దులకు వేసే ముకుతాళ్లు, మెడలో వేసే గంటలు, పనగజ్జలు, మూగలు, కుచ్చులు, కొమ్ములకు అలంకరించే వస్తువులు, పగ్గాలు, గొండెలు తదితర అలంకరణ సామగ్రి అమ్మకానికి రావడంతో రైతులు ఉత్సాహంగా కొనుగోలు చేశారు. పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ సమీపంలో టైర్లతో కూడిన ఇనుప ఎడ్ల బండ్లను అమ్మకానికి ఉంచారు. ఎడ్ల బండ్లు రూ.42 వేల నుంచి ఆపైనే ధర పలుకుతుండగా వ్యవసాయంలో ఉపయోగించే విత్తన, ఎరువులు వేసే ఇనుప గొర్రులు, నాగళ్లు తదితర వ్యవసాయ సామగ్రిని సైతం వ్యాపారులు విక్రయానికి ఉంచారు. వ్యవసాయానికి అవసరమైన వస్తువులన్నీ అందుబాటులో ఉండడంతో రైతన్నలు ఉత్సాహంగా కొనుగోలు చేస్తున్నారు.


వృషభాలకు వేసే ముకుతాళ్లు, చెర్నకోళ్లు, తదితర వస్తువులు


విక్రయానికి వచ్చిన ఎడ్ల బండ్లు


విత్తనం వేసే గొర్రులు, నాగళ్లు

దేవరగట్టులో భక్తిశ్రద్ధలతో పూజలు


మాళ మల్లేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న పూజారులు

హొళగుంద: ఉమ్మడి జిల్లాలో ప్రత్యేకత సంతరించుకున్న దేవరగట్టులో ఆదివారం స్వామివారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వరస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు జరిగాయి. పూజల్లో భాగంగా స్వామి వారికి సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, పుష్పార్చన, మహామంగళారతి, ఆకుపూజ, నివేదన, నీరాజన తదితర పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా స్వామి విరాట్‌మూర్తులను పూలతో అలంకరించారు. స్థానికులే గాకుండా కర్ణాటక నుంచి వచ్చిన భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు స్థానిక ఆస్పరి మఠంలో అన్నదానం చేపట్టారు.

విరగ్గాసిన మిరప


చిప్పగిరిలో విరగ్గాసిన మిరప

చిప్పగిరి: హంద్రీ–నీవా ఆయకట్టు రైతులు సాగుచేసిన మిరప పైరు విరగ్గాయడంతో మండల రైతుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. చిప్పగిరితో పాటు మండలంలోని ఏరూరు, బంటణహాలు, డేగులహాలు, కాజీపురం, గుమ్మనూరు తదితర గ్రామాల్లో హంద్రీ–నీవా నీటితో కడ్డి, డబ్బి, సీడ్ తదితర రకాల మిరప పంటలను రైతులు సాగుచేశారు. మిరప విరగ్గాయడంతో ఆ రకాన్ని బట్టి ఎకరానికి 10 క్వింటాళ్ల నుంచి 30 క్వింటాళ్లు దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులు తెలిపారు. ధర గతేడాది కంటే తక్కువగా ఉన్నట్లు పేర్కొన్నారు. మండలంలో మొత్తం 9,353 ఎకరాల్లో మిరప పంట సాగైనట్లు ఏఓ విజయలక్ష్మి తెలిపారు.

అట్టహాసంగా వృషభాల బండలాగుడు పోటీలు


వృషభాల యజమాని జీపీ చౌదరికి బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి


రాతి దూలాన్ని లాగుతున్న వృషభాలు

ఎమ్మిగనూరుటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతుల కష్టాలు తీర్చేందుకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి పేర్కొన్నారు. నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా స్థానిక వైడబ్ల్యూసీఎస్ మైదానంలో ఆదివారం ఎమ్మిగనూరు రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఒంగోలు ఎద్దుల బలప్రదర్శన (బండలాగుడు పోటీలు)ను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, రైతు సంఘ నాయకుడు భీమిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘుతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి కోసం అమలుచేసిన పథకాలను వివరించారు. ఉత్సవాల్లో భాగంగా రైతులు, పశుపోషకుల కోసం ఎద్దుల బలప్రదర్శన పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఎంపీపీ కేశన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, నాయకులు రియాజ్‌అహమ్మద్, మాచాని వెంకటేష్, సుధాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మన్సూర్, పిల్లిగుండ్ల గోవిందు, కుమారస్వామి, పేట శ్రీనివాసరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కోటకొండ నరసింహులు, కేశవ రెడ్డి, బజారి తదితరులు పాల్గొన్నారు.

విజేత కొండయ్యపాలెం వృషభాలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని వైడబ్ల్యూసీఎస్ మైదానంలో మొదటి రోజు జరిగిన రాష్ట్రస్థాయి ఒంగోలు ఎద్దుల బల ప్రదర్శన పోటీలో గుంటూరు జిల్లా కొండయ్యపాలెంకు చెందిన జీపీ.చౌదరి వృషభాలు విజేతగా నిలిచాయి. వృషభాల యజమానికి ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి మొదటి బహుమతి రూ.40 వేలు అందజేశారు. రెండవ స్థానంలో తొటపాలెంకు చెందిన పుచ్చకాయల శేషాద్రి చౌదరి, ముదిరాళ్ల ముప్పాలకు చెందిన రామినేని రత్తయ్య చౌదరి వృషభాలు, మూడవ స్థానంలో పంచలింగాలకు చెందిన బైరపోగు వృషభాలు, నాలుగవ స్థానంలో కలుగొట్ల గ్రామానికి చెందిన రమేష్‌నాయుడు వృషభాలు, ఐదవ స్థానంలో రుద్రవరంకు చెందిన గోపాల్‌గౌడ్ వృషభాలు నిలవగా ఆ యజమానులకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. ఆర్గనైజర్లు బీఆర్ బసిరెడ్డి, భీమిరెడ్డి, కన్వీనర్ గాజుల కుమారస్వామి, యాంకర్లు వాడాల రామానాయుడు, అబ్దుల్ కలాం తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసే వారికి సముచిత స్థానం


ములుగుందంలో వృద్ధుడిని ఆప్యాయంగా పలకరిస్తున్న విరూపాక్షి

ఆస్పరి: వైఎస్సార్‌సీపీలో కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని, అందుకు తానే నిదర్శనమని పార్టీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బుసినె విరూపాక్షి అన్నారు. ఆయన ఆదివారం మండలంలోని బనవనూరు, ములుగుందం, పలకూరబండ, కారుమంచి, వెంగళాయిదొడ్డి గ్రామాలలో విస్తృతంగా పర్యటించి ప్రభుత్వ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. ఆయా గ్రామాల్లో సమన్వయకర్తకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలోని నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి మరోసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు వైఎస్సార్‌సీపీలో న్యాయం జరుగుతుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి, సంక్షేమం కొనసాగుతుందని వివరించారు. ఆయా గ్రామాలలో కొలువుదీరిన సుంకులమ్మవ్వ, దస్తగిరిస్వామి, శ్రీశైలం తాత, దక్షిణమూర్తి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, వైస్ ఎంపీపీ చంద్రకళ, సర్పంచులు పెద్దరెడ్డి, లక్ష్మి, వెంకటేష్, నాయకులు మూలింటిరాఘవేంద్ర, కట్టెల గోవర్ధన, పెద్దయ్య, దత్తాత్రేయరెడ్డి, లక్ష్మినారాయణ, సుంకర రామాంజినేయులు తదితరులు ఉన్నారు.

నేడు సొసైటీ భవనం ప్రారంభోత్సవం


ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న పీఏసీఎస్ భవనం

హొళగుంద: మండల సమీపంలోని శ్రీరాంనగర్ క్యాంప్‌లో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) నూతన కార్యాలయ భవనాన్ని సోమవారం ప్రారంభించనున్నారు. పాత భవనం శిథిలావస్థకు చేరి అధ్వానంగా ఉండడంతో నాబార్డ్, ఆప్కాబ్, డీసీసీబీ రుణాలతో ఆఫీస్ రూం, గోడౌన్, బ్యాంక్ లాకర్ గది ఇలా అనేక సదుపాయలతో నిర్మాణం పూర్తి చేసినట్లు సింగిల్ విండో చైర్మన్ మేలగిరి మల్లికార్జున తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ విజయమనోహరి, ఇతర ప్రముఖులు హాజరవుతారని, మండలానికి చెందిన జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఇతర ప్రజాప్రతినిధులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

బ్రహ్మగుండేశ్వరుని రథానికి మెరుగులు


రథాన్ని పరిశీలిస్తున్న బొమ్మన రవిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ బొమ్మన పెద్దిరెడ్డి తదితరులు

వెల్దుర్తి(కృష్ణగిరి): పట్టణ సమీపంలోని మహిమాన్విత శైవక్షేత్రం బ్రహ్మగుండంలోని దేవుని పురాతన రథం (తేరు) నూతన రంగులద్దుకుంది. ఆలయ కమిటీ చైర్మన్ బొమ్మన పెద్దిరెడ్డి దేవదాయ, ధర్మదాయ శాఖ, దాతల సహకారంతో ఆలయంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, భక్తుల సౌకర్యార్థం పలు పనులు చేపట్టారు. స్వామి వారి శతాబ్దం నాటి టేకు చెక్క, రాతి చక్రాలతో కూడిన దాదాపు 30 అడుగుల పురాతన రథం ఆధునికీకరించారు. ఇందుకు వెల్దుర్తి పట్టణానికి చెందిన చాకలిరాముడు కుమారులు రూ.70 వేలు విరాళం అందించారు. స్థానిక పెయింటర్లు ప్రత్యేక శ్రద్ధతో దేవుడి రథ చక్రాలకు పుష్పాలంకరణ, మిగతా భాగాలకు టేకు చెక్కతో వన్యమృగాలు, దేవతా ఆకృతులు, వివిధ భంగిమలకు, దేవతా విగ్రహాల ఆసనాన్ని, పై భాగాన్ని, ఇనుముతో చేసిన వంకీల పైభాగాన్ని వివిధ రంగులతో ప్రత్యేకంగా రూపుదిద్దారు. ఏటా మహాశివరాత్రి పర్వదినాన కల్యాణమూర్తులైన గంగా, కామేశ్వరీ దేవి సమేత బ్రహ్మగుండేశ్వరుడికి రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ దఫా నూతన రంగులద్దుకున్న రథంపై దేవతామూర్తులు ఊరేగనున్నారన్న తలంపుతో భక్తులు పులకిస్తున్నారు. వైఎస్సార్సీపీ మండలాధ్యక్షుడు బొమ్మన పెద్దిరెడ్డి, నాయకులు శివారెడ్డి తదితరులు రంగులద్దుకున్న రథాన్ని, ఆలయం ముందు సీసీ రోడ్ల నిర్మాణ అభివృద్ధి పనులను పరిశీలించి ఆలయ కమిటీ చైర్మన్ కృషిని ప్రశంసించారు.

ముమ్మరంగా బీటీ రోడ్డు నిర్మాణం


యంత్రం ద్వారా తారు రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం

నందవరం: నాగలదిన్నె – మంత్రాలయం రహదారి పనులు శరవేగంగా సాగుతున్నాయి. రూ.18 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం ముమ్మరంగా జరుగుతోంది. నందవరం మండలం నాగలదిన్నె బ్రిడ్జి నుంచి 18 కి.మీ పొడవునా మంత్రాలయం వరకు రోడ్డు పనులు చేస్తున్నారు. అందులో భాగంగా దాదాపు 14 కి.మీ మేర రహదారి నిర్మాణం పూర్తయింది. ఇంకా 4 కి.మీ మేర బీటీ నిర్మాణం పనులు జోరుగా సాగుతున్నాయి. రోడ్డు నిర్మాణం పూర్తి కావస్తుండడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వైద్యుడికి గాయాలు

ఆదోనిఅర్బన్: మండలంలోని నగరూరు గ్రామ సమీపంలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో పత్తికొండ ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ ఆదినగేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. పత్తికొండ ప్రభుత్వాస్పత్రిలో విధులు నిర్వహించేందుకు ఆదోని నుంచి బైక్‌పై వెళుతున్నారు. ఆదోని మండలం నగరూరు వద్ద బైకు అదుపు తప్పి కింద పడింది. ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేసినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. గతంలో ఈయన ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో డాక్టర్‌గా విధులు నిర్వహించారు. ఇటీవలే బదిలీపై పత్తికొండకు వెళ్లారు.

అలరించిన నాటక ప్రదర్శన


గయోపాఖ్యానం నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

ఎమ్మిగనూరుటౌన్: నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా పట్టణంలో రెండు రోజులుగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఎర్రకోట జగన్ యూత్ నాయకులు సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో 'రేలారే రేలా–దుమ్ము లేపు' కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో నీలకంఠేశ్వర స్వామి నాటక కళా సమితి ఆధ్వర్యంలో మయసభ కురుక్షేత్రం పడకసీను, శ్రీకృష్ణ, భవాని సీను, అష్టమాంకాములు తదితర పౌరాణిక నాటక ప్రదర్శనలు నిర్వహించారు. గయోపాఖ్యానంలో శ్రీకృష్ణుడు, అర్జునుడి పాత్రల్లో విజయవాడ, హైదరాబాద్‌కు చెందిన నందిఅవార్డు గ్రహీతలు శ్రీనివాసరెడ్డి, రత్నశ్రీ, కిలారి లక్ష్మి, వి.రాముడు తదితరులు ఆకట్టుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున 3 గంటల వరకు కొనసాగిన నాటక ప్రదర్శనలను ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి తిలకించారు. అనంతరం కళాకారులను సత్కరించారు. మాజీ ఎంపీ బుట్టా రేణుక, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షులు రిటైర్డ్ ఎంఈఓ రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు


ఆలూరు గ్రామ పంచాయతీకి చెందిన భూమిని చదును చేయిస్తున్న అధికారులు

ఆలూరు రూరల్: జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీకి చెందిన సాగు భూమి అన్యాక్రాంతం కాకుండా స్థానిక అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గత 40 ఏళ్ల క్రితం ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీ నిర్వహణ కోసం చిప్పగిరి మండలంలోని రామదుర్గం గ్రామ సర్వే నంబర్ 424లో 32.20 ఎకరాల సాగు భూమిని దాతలు దానంగా ఇచ్చారు. అప్పట్లో అది సాగులో ఉండేది. తర్వాత 30 ఏళ్లుగా సాగులో లేక బీడు భూమిగా మారింది. ప్రస్తుతం అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని ఆ భూమిని సాగులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. రూ.3 లక్షల నిధులతో ఆ భూమిలోని కంప చెట్లను తొలగించి చదును చేయిస్తున్నారు. సదరు భూమి సాగుకు బహిరంగ వేలం నిర్వహించి (కనీస ధర ఎకరానికి రూ.10 వేలు) అధిక మొత్తం పాడిన వారికి మూడేళ్ల పాటు కౌలుకు ఇవ్వనున్నారు. తద్వారా సమకూరిన ఆదాయాన్ని గ్రామ పంచాయతీ అభివృద్ధికి ఖర్చు చేస్తారు.

కబ్జాకు గురికాకుండా చర్యలు

చిప్పగిరి మండలం రామదుర్గం గ్రామంలో ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీకి చెందిన సాగు భూమి 30.20 ఎకరాలు ఉంది. ఈ భూమి కబ్జాకు గురికాకుండా చదును చేయిస్తున్నాం. ఇందు కోసం రూ.3 లక్షలు వెచ్చించాం. ఆ భూమిని బహిరంగ వేలం నిర్వహించి రైతులకు కౌలుకు ఇస్తాం. పంచాయతీ భూమిని ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– ఈఓపీఆర్డీ ప్రకాష్‌నాయుడు

విజేత గుంప్రమానుదిన్నె వృషభాలు


పెండేకల్లులో వృషభాల బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న గ్రామ పెద్ద భాస్కర రెడ్డి

తుగ్గలి: కాశీంస్వామి ఉరుసు ఉత్సవాల సందర్భంగా ఆదివారం నిర్వహించిన ఎద్దుల రాతి దూలం లాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీలను బహుమతి దాతలతో కలిసి గ్రామ పెద్ద కారం భాస్కరరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు అట్ల గోపాల్‌రెడ్డి ప్రారంభించారు. పోటీలలో నంద్యాల జిల్లా గుంప్రమానుదిన్నె రాంభూపాల్ రెడ్డి వృషభాలు విజేతగా నిలిచాయి. తర్వాతి స్థానాల్లో నాగర్‌కర్నూలు జిల్లా రాయవరం అక్షర్‌రెడ్డి వృషభాలు, అనంతపురం జిల్లా వరదాయపల్లె శ్రీరాములు వృషభాలు, రేగడికొత్తూరు, బొందలదిన్నె గురులోహిత, గౌతంరెడ్డి వృషభాలు, కర్నూలు జిల్లా పుచ్చకాలయమాడ డీజే బుల్స్ ధనుంజయ వృషభాలు నిలిచాయి. విజేతగా నిలిచిన వృషభ యజమానులకు వరుసగా రెడ్డీస్ బ్రదర్స్ రూ.40 వేలు, వాల్మీకి బ్రదర్స్ రూ.30 వేలు, చెన్నంపల్లి సుభాన్‌వలి రూ.20 వేలు, పెండేకల్లు నాగభూషి, శ్రీరాములు రూ.10 వేలు, రాజు రూ.5 వేలు నగదు బహుమతులు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సచివాలయ కన్వీనర్ అట్ల బసిరెడ్డి, నిర్వాహకులు రంగన్న, శ్రీనివాసులు, నాగభూషణం పాల్గొన్నారు.